బెట్టింగ్ మాయలో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

- నారాయణపేట ఎస్పీ యోగేశ్‌గౌతమ్

మాట్లాడుతున్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నారాయణపేట, మార్చి 26 : యువత క్రికెట్ బెట్టింగ్ మాయలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న కారణంగా చాలామంది యువత ఈజీగా డబ్బులు సంపాదించడం కోసం క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతారన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లతో ఆర్థికంగా దెబ్బతిని, తల్లిదండ్రులకు చెప్పుకోలేక సూసైడ్ చేసుకొని ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లు ఆడడం అత్యంత ప్రమాదకరమని, ఆటను వినోదంగానే చూడాలన్నారు. ఎన్నికల సమయంలో పోలీసుల దృష్టంతా ఎన్నికల వైపే ఉంటుందని అనుకోరాదని, క్రికెట్ బెట్టింగ్ పాల్పడే వారిపై నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పౌష్టికాహార లోపాన్ని నివారించాలి

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి

నారాయణపేట టౌన్, మార్చి 26 : చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని గుర్తించి అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నివారణ కార్యక్రమంపై ఎంఎల్‌హెచ్‌పీ, సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం, బుద్ధి మాంద్యమం, ఐక్యూ లోపించడం జరుగుతుందన్నారు. చేపలు, పాలు, ఆకుకూరలు, పైనాపిల్ తదితర పదార్థాల్లో అయోడిన్ ఎక్కువగా ఉంటుందన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 30గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 6-12ఏండ్లలోపు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సాయిరాం గుప్తా, రాఘవేంద్రరెడ్డి, పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

పీయూలో అంతర్జాతీయ వర్క్‌షాప్

మాట్లాడుతున్న ప్రొఫెసర్ మనోజ

పాలమూరు, మార్చి 26 : జిల్లా కేంద్రం సమీపంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో సాహిత్యంపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ప్రొఫెసర్లు రాజునాయక్, ఇప్లూ, గూడూరు వనజ, మనోజ హాజరయ్యారు. సాహిత్యంపై విశ్వవిద్యాయంలో పరిశోధనలు జరగాలని సూచించారు. ప్రొఫెసర్ డేనియల్‌నేజర్స్ అంతరించిపోతున్న ఆదివాసిల ఆస్తిత్వం గురించి వివరించారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు గిరిజన, ఆదివాసీల జీవన విధానం, ఉనికి గురించి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, పీజీ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న తాసీల్దార్

నవాబ్‌పేట, మార్చి 26 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు తాసీల్దార్ నాన్యనాయక్ మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 73 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ విష్ణుప్రియ, ఆర్ఐ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

శిక్షణను ప్రారంభించి మాట్లాడుతున్న కన్యాకుమారి

నారాయణపేట, మార్చి 26 : గ్రూప్ 1, 2,3,4 పరీక్షకు సిద్ధమవుతున్న ఎస్సీ నిరుద్యోగ యువతీ, యువకులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కన్యాకుమారి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను ఆమె ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగ యువతకు గ్రూప్ పరీక్షల కోసం 3నెలల పాటు ఉచిత శిక్షణను రెసిడెన్షియల్ పద్ధతిలో ఇవ్వడం జరుగుతుందన్నారు.

కోచింగ్ అనంతరం ఉచితంగా మెటీరియల్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రంగారెడ్డి, కోచింగ్ ఫ్యాకల్టీ దస్తయ్య, వసతిగృహ సంక్షమాధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

పాలమూరు, మార్చి 26 : ఎంవీఎస్ కళాశాల వలంటీర్లు భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని హస్సాపూర్‌లోని క్రీడా ప్రాంగణాన్ని మంగళవారం శుభ్రం చేశారు. గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. యోగా ట్రైనర్ జగదీశ్వర్‌రెడ్డి యోగా ప్రాముఖ్యత, లాభాలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రోగ్రాం అధికారులు రాఘవేంద్రరెడ్డి, స్వరూప, నిరంజన్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న వలంటీర్లు

ముగిసిన కందూరు బ్రహ్మోత్సవాలు

మూసాపేట(అడ్డాకుల), మార్చి 26 : దక్షణకాశీగా పేరుగాంచిన కందూరు రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. వేద పండితులు, గ్రామపెద్దలు, యువకులు కలిసి గ్రామం నుంచి కొత్త మట్టి పాత్రల్లో రంగునీళ్లను ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ కళశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం కోనేరులో ఉత్సవ విగ్రహాలకు త్రిశూలస్నానం(అభిషేకం) చేశారు. అక్కడి నుంచి ఆలయంలోకి తీసుకెళ్లి పూజలు చేసి బ్రహ్మోత్సవాలను ముగించారు.

మూసాపేట : స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

మద్దిగట్లలో బోనాలు

భూత్పూర్, మార్చి 26 : మండలంలోని మద్దిగట్ల లో పోచమ్మ బోనాల పండుగను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి పోచమ్మతల్లికి నైవేద్యం సమర్పించారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి కళాకారులతో నృత్యాలను చేయించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

భూత్పూర్ : మద్దిగట్లలో బోనాల ఊరేగింపులో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి

వైభవంగా శకటోత్సవం

నవాబ్‌పేట, మార్చి 26 : మండలంలోని పల్లెగడ్డ ఆది బసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఘట్టమైన శకటోత్సవాన్ని భక్తులు మంగళవారం వైభవంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పల్లెగడ్డ, నవాబ్‌పేట, కామారం, పోమాల, మల్కాపూర్, గురుకుంట, ధర్పల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఎడ్ల బండ్లను, వాహనాలను అందంగా అలంకరించి ఆలయం చుట్టూ ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పల్లెగడ్డ సర్పంచ్ చెన్నమ్మ, ఉత్సవ కమిటీ సభ్యులు జంగయ్య, ప్రతాప్, సత్తయ్య, శ్రీను, పురుషోత్తం, రాములు, పాండు పాల్గొన్నారు.

నవాబ్‌పేట : ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లు, వాహనాలను ఊరేగిస్తున్న భక్తులు

మూసాపేట : కోనేరులో త్రిశూల స్నానం చేస్తున్న భక్తులు

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 27 : ప్రభుత్వ జనరల్ దవాఖానలో కేర్ దవాఖాన ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గుండె పరీక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానలోని 2వ ఆంతస్తు సమావేశ మందిరంలో ఆర్‌బీఎస్‌కే- డీఈఐసీ కేంద్రం, కేర్ దవాఖాన బంజారాహిల్స్ హైదరాబాద్ వారి సహకారంతో 18ఏండ్లలోపు వారికి ఉచిత గుండె పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలు వినియోగించుకోవాలని సూఇచించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కురుమ యాదవ సంఘం నాయకులు

ఊట్కూర్, మార్చి 26 : మండలంలోని పెద్దజట్రంలో కురుమ యాదవుల ఆరాధ్యదైవం బీరలింగేశ్వరస్వామి బండారు మహోత్సవాలు ఈనెల 31 నుంచి నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలువురు కుల పెద్దలు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిసి ఉత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఎన్నికల్లో ఎదుర్కోలేకే ఖాతాల ఫ్రీజ్

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బీజేపీ ఎదుర్కొలేక సంబంధిత ఖాతాలను కుట్రపూరితంగా ఫ్రీజ్ చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్‌అక్తర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే భయంతో పార్టీకి సంబంధించిన 11 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిందని ఆరోపించారు. ప్రతిపక్షాలను ఈడీ పేరుతో భయపెట్టిస్తూ జైలుకు పంపుతున్నారని విమర్శించారు. ఎన్నికుట్రలు చేసినా పార్లమెంట్ ఎన్నికల్లో విజయాన్ని ఆపలేరన్నారు. ఎలక్టోల్ బాండ్ల పేరుతో బీజేపీ పెద్ద స్కాం చేసిందని ఆరోపించారు. దేశంలో 38 పెద్ద కంపెనీలకు 179 కాంట్రాక్టులు ఇవ్వడంలో అంతర్యమేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాండ్లను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించగా, 5నెలల సమయం కావాలని ఎస్‌బీఐ అంటుందని, బీజేపీని కాపాడడం కోసం ఇంత వ్యవధి కోరుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సమావేశంలో మీడియాసెల్ కన్వీనర్ నీజే బెనహర్, మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్

మానసికంగా దృఢంగా ఉండాలి

పాలమూరు, మార్చి 26 : శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ సూచించారు. స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం లైఫ్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'జీవ వైవిధ్య పరీక్షణ-మానవ జీవితంపై ప్రభావం' అనే అంశంపై ఈనెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జాతీయ స్థాయి కార్యాశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం ఆరోగ్యకమైన సమాజానికి మనం తీసుకునే జాగ్రత్తలే మన ఆరోగ్యాన్ని కాపాడుతాయని చెప్పారు. డాక్టర్ వనజ రుతుచక్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంగాధర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణ

మద్యం పట్టివేత

ఊట్కూర్, మార్చి 26 : మండలంలోని చిన్నపొర్లకు చెందిన రవి కిరాణ దుకాణంలో మంగళవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 39.36 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.20,091 ఉంటుందని, దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

- 80శాతం ఆస్తిపన్ను వసూలు
- మున్సిపల్ కమిషనర్ రాజయ్య

జడ్చర్ల, మార్చి 26 : మార్చి 31వ తేదీలోగా ఆస్తిపన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ రాజయ్య తెలిపారు. జడ్చర్ల మున్సిపాలిటీలో 2023-24 సంవత్సరానికిగానూ రూ.3.5కోట్ల బకాయిలు ఉన్నాయని, ఇప్పటివరకు రూ.2.45 కోట్లు 80శాతం వసూలు చేశామని తెలిపారు. మిగతా వారు ఈ నెలాఖరులోగా చెల్లించాలని కోరారు. అదేవిధంగా ఇప్పటివరకు ఆస్తిపన్ను బకాయిలు ఉన్నవారు ఈనెల 31వ తేదీలోగా చెల్లిస్తేవారికి 90శాతం వడ్డీమాఫి అవుతుందని, ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తిపన్ను చెల్లించనివారు తమ శాఖ నుంచి పన్నులు చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి నిధులను విడుదల చేసే విధంగా వినతులు చేయాలని తెలిపారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మున్సిపాలిటీలో నివసించే ప్రజలు వేసవి కాలం ఉన్నందున నీటిని పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ రాజయ్య సూచించారు. నల్లాలు వచ్చే సమయంలో ప్రజలు నిటిని ఎక్కువగా స్టోరేజీ చేకునేలా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా నల్లాల ద్వారా నీటిని విడుదల చేసిన సమయంలో నల్లాలను వృథాగా వదిలివేయరాదని వాటికి ట్యాప్‌లు పెట్టి బంద్ చేయాలని తెలిపారు. నీటిని వృధాగా వదలడంవలన మిగతా వారికి నీటి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని అందుచేత పట్టణ ప్రజలు నల్లాలు వచ్చే సమయంలో నీటిని వృధాచేయకుండా ఎక్కువగా నిల్వఉంచుకునే ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. నీటిని ఎక్కువగా నిల్వ చేసుకోవడం వలన నల్లాలు రాని సమయంలో అవి ఉపయోగపడతాయన్నారు. ఈ వేసవిలో నీటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కమిషనర్ రాజయ్య

విద్యా సమాచారం

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు, మార్చి 26 : గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారిణి ఫ్లారెన్స్‌రాణి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా www.tswreis.ac.in ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో..

ఊట్కూర్, మార్చి 26 : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరం 6, 7, 8, 9 తరగతుల్లో విద్యార్థుల ఖాళీలు (బీఎల్‌వీ) భర్తీ చేసేందుకు ఏప్రిల్ 30 తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఊట్కూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత మంగళవారం ప్రకటనలో తెలిపారు. తరగతుల వారీగా ఖాళీల వివరాలు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం కోసం టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సంస్థ వెబ్‌సైట్ www.tswreis.ac.in, టీటీడబ్ల్యూఆర్‌ఈఐ సంస్థ వెబ్‌సైట్ tgtwgurukulam.telangana.gov.in ను సంప్రదించాలన్నారు. ఏప్రిల్ 21 తేదీ ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నారాయణపేటలో..

నారాయణపేట టౌన్, మార్చి 26 : 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జిల్లా సమన్వయకర్త దేవసేన మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 11నుంచి ఒంటిగంట వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా 8వ తరగతి విద్యార్థులు 9వ తరగతిలో ప్రవేశానికి గౌలిదొడ్డి, హైదరాబాద్, అల్లునూరు, కరీంనగర్‌లో ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

31 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

పాలమూరు, మార్చి 26 : జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ సైన్స్ విద్యార్థులకు సెమిస్టర్-3, సెమిస్టర్-5, ప్రయోగ పరీక్షలు ఈనెల 31వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ తెలిపారు. ప్రయోగ పరీక్షకు హాజరైయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, గుర్తింపు కార్డు, ఫీజు చెల్లించిన రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు క్రిస్టియన్‌పల్లిలోని ఎంవీఎస్ కళాశాలలో నేరుగా లేదా 7382929609 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

టెట్ ఫీజును తగ్గించాలి..

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 26 : టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ మంగళవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు లేకుండానే పరీక్ష నిర్వహిస్తామని చెప్పి, ఐదోంతుల ఫీజు వసూలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

నారాయణపేటలో..

నారాయణపేట టౌన్, మార్చి 26 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం డిమాండ్ చేశారు. పట్టణంలో నిసీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతకుముందు ఒక్కో పేపర్‌కు రూ.300 ఉండగా, ప్రస్తుతం ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున రెండు పేపర్లు రాయాలంటే రూ.2వేలు కట్టాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజులు విచ్చలవిడిగా పెంచి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. ఫీజు తగ్గించకపోతే పీవైఎల్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు ఆర్డర్ కాపీలు అందజేత

ఆర్డర్ కాపీలు పొందిన విద్యార్థులతో పీజీ ప్రిన్సిపాల్

పాలమూరు, మార్చి 26 : పాలమూరు విశ్వవిద్యాలయ కళాశాల సెమినార్‌లో ఈనెల 6వ తేదీన నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మంగళవారం చైతన్య స్కూల్ ప్రతినిధి మధుసూదన్, పీజీ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ ఆర్డర్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా పీయూ ఉపకులపతి లక్ష్మీకాంత్‌రాథోడ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

కృష్ణ, మార్చి 26 : మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం సామాన్యశాస్త్రం మొదటి పేపర్‌కు వందశాతం విద్యార్థులు హాజరైనట్లు విద్యాధికారులు తెలిపారు.

7,653 మంది హాజరు..

నారాయణపేట రూరల్, మార్చి 26 : పదో తరగతి పరీక్షలు మంగళవారం జిల్లాలో ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా 7,678 మంది విద్యార్థులకు గానూ 7,653 మంది హాజరుకాగా, 25 మంది గైర్హాజరయ్యారు. 17మంది ప్రైవేట్ విద్యార్థులకు గానూ 14మంది విద్యార్థులు హాజరయ్యారు. డీఈవో అబ్దుల్‌గని, ఏసీజీఈ రమేశ్‌శెట్టి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

కందూరులో రంగులు చల్లుకుంటున్న గ్రామస్తులు

కందూరులో హోలీ

మూసాపేట, మార్చి 26 : అడ్డాకుల మండలంలోని కందూరులో శ్రీరామలింగేశ్వర బ్రహ్మోత్సవాలు ఉండడంతో హోలీ పండుగను మరుసటి రోజున జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తున్నది. దీంతో మంగళవారం చిన్నా, పెద్దా రంగులు చల్లుకొని హోలీ సంబురాలను నిర్వహించారు.

ఏఎస్సై మృతికి సంతాపం

మమబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 26 : మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సైగా పనిచేస్తున్న జావేద్ గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జిల్లా అదనపు ఎస్పీ రాములు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. జావేద్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.